# భారత మెజారిటీ చట్టము, 1875
## (1875లోని 9వ చట్టము)

( 2 మార్చి, 1875 )

మెజారిటీ వయస్సుకు సంబంధించిన శాసనమును సవరించుటకైన చట్టము.

**ప్రస్తావన**

భారత దేశములో అధివాసముగల వ్యక్తుల విషయమున అవయస్కతాకాలావధిని పొడిగించుట మరియు మెజారిటీ వయస్సును గూర్చి ఇప్పటి దానికంటే ఎక్కువ ఏకరూపతను, నిశ్చయత్వమును చేకూర్చుట ఉపయుక్తమైనందున ఇందుమూలముగ ఈ క్రింది విధముగ శాసనము చేయబడినది:—

**సంగ్రహ నామము స్థానిక విస్తరణ ప్రారంభము మరియు అమలు.**

1. ఈ చట్టమును భారత మెజారిటీ చట్టము, 1875 అని పేర్కొనవచ్చును.

ఇది జమ్మూ-కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును.

ఇది చేయబడినప్పటి నుండి మూడు మాసములు గడవగనే అమలులోనికి వచ్చి, ప్రభావము కలిగియుండును:

అయితే ఈ చట్టములోనిదేదియు కేంద్ర రాజ్య క్షేత్రమైన పుదుచ్చేరిలోని రెనోసాంలకు వర్తించదు.

**వ్యావృత్తులు.**

2. ఈ క్రింది వాటికి అనగా —

(ఏ) వివాహము, డవరు, విడాకులు, మరియు దత్తత విషయములలో వ్యవహరించుటకు ఏ వ్యక్తికైనను కావలసిన దక్షతకు గాని,

(బి) భారత దేశ పౌరులలో ఏ వర్గమైనను అనుసరించు మతమునకు గాని వారి మత సంబంధమైన కృత్యములకు, పాడుకలకు గాని, లేక

(సి) ఈ చట్టము అమలులోనికి వచ్చుటకు పూర్వము, ఏ వ్యక్తికైనను వర్తించు శాసనముననుసరించి మెజారిటీ వయస్సు సంప్రాప్తించినచో, అతని దక్షతకు గాని,

ఈ చట్టములోనిదేదియు భంగము కలిగించదు.

**భారతదేశములో అధివసించు వ్యక్తులు మేజర్లగు వయస్సు.**

3. పైన చెప్పినదానికి లోబడి, భారత ఉత్తరాధికార చట్టము, 1865 (1865లోని 10వ చట్టము) లో గాని, ఏదేని ఇతర అనుశాసనములో గాని, ఏమి యున్నప్పటికిని, ఒక మైనరుకు పదునెనిమిది సంవత్సరముల వయస్సు సంప్రాప్తించక పూర్వమే ఏదేని న్యాయస్థానముచే, అతని శరీర విషయమునగాని, ఆస్తి విషయమునగాని, లేక రెండింటి విషయమున గాని సివిలు ప్రక్రియా స్మృతి (1882లోని 14వ చట్టము) యొక్క 31వ అధ్యాయపు భావములో "దావా సంరక్షకుడు" కానట్టి సంరక్షకుడు నియమింపబడినచో లేక నియమింపబడుచో లేక అట్టి సంరక్షకుడుగా ప్రఖ్యానింపబడినచో లేక ప్రఖ్యానింపబడుచో మరియు పైన చెప్పబడిన వయస్సు సంప్రాప్తించక పూర్వమే మైనరు ఆస్తి యొక్క అదీక్షణము కోర్ట్ ఆఫ్ వార్డ్సుచే చేపట్టబడినచో, లేక చేపట్టబడుచో, అట్టి ప్రతి యొక్క మైనరుకు ఇరువది యొక్క సంవత్సరముల వయస్సు పూర్తియైనపుడే మెజారిటీ సంప్రాప్తమైనట్లు భావించవలెనేగాని అంతకు పూర్వము అట్లు భావించరాదు:

పైన చెప్పినదానికి లోబడి, భారత దేశములో అధివసించు ప్రతి ఇతర వ్యక్తికి పదునెనిమిది సంవత్సరముల వయస్సు పూర్తి కాగానే మెజారిటీ సంప్రాప్తమైనట్లు భావించవలెను గాని అంతకు పూర్వము అట్లు భావించరాదు.

**మెజారిటీ వయస్సును సంగణనము చేయు పద్ధతి.**

4. ఏవరేని వ్యక్తి యొక్క వయస్సును సంగణించుటలో అతడు జన్మించిన దినమును పూర్తి దినముగా చేర్చుకొని అతడు మూడవ పరిచ్ఛేదములోని ఒకటవ పేరా పరిధిలోని వాడైనచో, అతనికి ఇరువది ఒకటవ సంవత్సరము పూర్తి అయ్యెడి జన్మ దినారంభమునను, అతడు మూడవ పరిచ్ఛేదములోని రెండవ పేరా పరిధిలోని వాడైనచో, అతనికి పదునెనిమిదవ సంవత్సరము పూర్తి అయ్యెడి జన్మ దినారంభమునను అతనికి మెజారిటీ సంప్రాప్తించినట్లు భావించవలెను.

**ఉదాహరణములు**

(ఏ) 'జెడ్' భారత దేశములో 1850, జనవరి 1వ దినమున జన్మించి భారత దేశమునందు అధివాసము కలిగియుండెను. న్యాయస్థానముచే అతని శరీర సంరక్షకుడు నియమింపబడెను. 'జెడ్' 1871, జనవరి 1వ దినపు ప్రథమ క్షణమందు మేజరగును.

(బి) 'జెడ్'—భారత దేశములో 1852, ఫిబ్రవరి 29వ దినమున జన్మించి భారత దేశమునందు అధివాసము కలిగి యుండెను. న్యాయస్థానముచే అతని ఆస్తికి ఒక సంరక్షకుడు నియమింపబడెను, 'జెడ్' 1873, ఫిబ్రవరి 28వ దినపు ప్రథమ క్షణమందు మేజరగును.

(సి) 'జెడ్'—1850 జనవరి 1వ దినమున జన్మించెను. అతడు భారత దేశములో అధివాసమును ఏర్పరచుకొనెను. న్యాయస్థానముచే అతని శరీర విషయమున గాని, ఆస్తి విషయమున గాని సంరక్షకుడు నియమింపబడలేదు. అతడు కోర్ట్ ఆఫ్ వార్డ్సు యొక్క అధికారిత క్రింద లేడు. 'జెడ్' 1868, జనవరి 1వ దినపు ప్రథమ క్షణమందు మేజరు అగును.